# కిస్మత్

స్ఫూర్తి కందివనం
96527 45117



లకు కొంత డబ్బిచ్చి వెళ్లిపోయాడు.

''అసలే తెల్వని ఊరాయే! గా సారెవరో టయానికి దేవుడ్లాగొచ్చిండు. లేకుంటే మన గతేమైతుండెనో!'' అతను వెళ్తున్న దిక్కే చూస్తూ అన్నది తిరుమలమ్మ.

''దునియల మంచితనమింగా ఉన్నదంటే నమ్మబుద్ధయితలేదు. ఆపత్కాలంల పక్కోని కష్టం తెల్సుకొని మరీ సాయం జేశేటోళ్లింకా ఉన్నరంటే దునియ కొత్తగ్గానొస్తున్నది నాకు!''.. తల్లిదండ్రులతోనే ప్రేమాప్యాయతలకు దూరమైన ఆమెకు, ఇప్పుడు తనకోసం ఆలోచిస్తున్న తిరుమలమ్మను, తను కుదుటపడేవరకు కంగారు పడిపోయిన షాపు యజమానిని చూస్తుంటే.. అదేదో జీవితంలో ఎప్పుడూ చూడని వింతను దగ్గరగా చూస్తున్నట్లుంది నాగమ్మకు. అర్ధరాత్రి వేళ మూగబోయిన అడవిలా మౌనంగా ఉండిపోయింది.

ఆ రాత్రంతా పడుకోకుండా నల్లని ఆకాశంలోకే చూస్తూ ఉంది. ఆమె పెండ్లప్పుడు తల్లిగారింటి నుంచి తెచ్చుకున్న నల్లజాడి మీద చిన్న మన్మరాలు తన గౌనుకున్న చమ్కీలను పీకి పారేసినట్లున్న చుక్కల వంకే తీక్షణంగా చూస్తూ ఉంది. వాటిలోంచి కనీసం ఒక్కటైనా.. పోనీ ఒక చిన్న తునకైనా నేల రాలిపడితే ఎంత బాగుండునో!? అప్పుడిక తన సమస్యలన్నీ తీరిపోతాయన్న వెర్రి ఊహతో వాటివైపే చూస్తూ ఉంది.

* * *

''రోజంత క్యాబ్ నడుపుకొని మల్ల రూముకొచ్చి వొండుకొని తినాల్నంటే బేజారొచ్చిపోతున్నది. అందుకే ఈసారి సరస్వతిని, పిల్లలను గూడ నా ఎంబడి తీస్కపోదమన్కుంటున్న'' అన్నాడోరోజు నాగమ్మ పెద్దకొడుకు యాదగిరి.

'సరిగ్గనే విన్ననా!?' అని ఆమె కనుబొమలు ముడేసి..

''మల్ల.. నేను? నన్ను గిట్ట దోల్కపోరా?'' అన్నది నాగమ్మ.

ఒక్కసారిగా ఆమె ముఖం ప్రశ్నాపత్రంగా మారిపోయింది. అందులో కొడుకేం సమాధానం రాస్తాడోనని ఆతృతగా అతని కళ్లలోకి చూసింది.

''అట్ల గాదే.. ఆడ నేనింకా ఇల్లు గిట్ల ఏం చూస్కోలేదు. ఇప్పుడుంటున్న రూము మా దోస్తుగాన్ది. వాడిప్పుడు ఊరికి వొయిండు. రానికే జెర టైం పడ్తదన్నడు. అందుకే ముందు వీళ్లను తోల్కపోత! ఓ వారం పది రోజులల్ల వేరే ఇల్లు చూస్కున్నంక నిన్ను గుడ్క తీస్కపోత. ఇప్పుడు అందరం వొయి ఆడుంటే ఇబ్బందైతది!'' అని చెప్తున్నప్పుడు.. అతని కళ్లలోని అబద్ధం నిజమవుతుందేమోనని లోలోపలే బుగులైంది నాగమ్మకు.

'నేనొక్కదాన్నే ఎక్కైతినా? ఏంగాదులే.. కష్టమో నష్టమో ఎట్లనన్న సదుర్కుందం. ఎన్ని సూశొచ్చిందాన్ని.. నాకిదో లెక్కనా!' అనబోయి ఎందుకో మాట గొంతులోనే ఇరుక్కుపోయింది ఆమెకు.

కొడుకు పిల్లోడిగా ఉన్నప్పుడు తను పనికెళ్లే సమయానికి రోజూ 'నేనొస్తా!' అంటూ వెంటపడేవాడు.

'వొద్దు' అని ఎంత చెప్పినా ఆమెని వెళ్లనివ్వకుండా చీర చెంగులు పట్టి గుంజుతూ గట్టిగా ఏడ్చేవాడు. పెద్దోణ్ని చూసి చిన్నోడు కూడా వెంటపడేవాడు. పిల్లలట్లా ఏడుస్తుంటే అడుగు ముందుకు పడేదికాదు ఆమెకు.

వాళ్లకు మాత్రం ఇంకెవరున్నారు? వాళ్లకన్నీ అమ్మేగా! అమ్మ వెంటుంటే చాలు!

అందుకే కాదనలేక వెంట తీసుకెళ్లేది.

ఇప్పుడు తన పరిస్థితి కూడా సరిగ్గా అలానే ఉందేమో అనిపిస్తున్నది నాగమ్మకు. కానీ 'అమ్మకు మాత్రం ఎవరున్నారు. నేనొక్కణ్నే గదా!' అని తనలా కొడుకెందుకు అనుకోవడం లేదన్న ఆలోచనకు ఆమె మనసు బీడు వారిపోయింది. ఈ విషయంలో కోడలు కూడా కలగజేసుకోకపోవడం ఆమెను మరింత వ్యధకు గురిచేస్తున్నది.

* * *

చెప్పినట్టుగానే కొడుకు 'తన' కుటుంబాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. వారం పది రోజుల్లో వచ్చి తనను కూడా తీస్కెళ్తానన్న వాడు, మొహం చాటేశాడు. చివరికి ఆమె ఫోన్‌చేస్తే ఎత్తడం కూడా మానేశాడు. నాగమ్మకు గుండెల్లో సన్నని బెరుకు మొదలైంది. వాళ్లు తననిక వొద్దనుకుంటున్నారన్న విషయం మెల్లిమెల్లిగా అర్థమవుతున్నది. ఇటు చూస్తే, వారం రోజుల్లో కిరాయి కట్టకుంటే ఇల్లు ఖాళీ చేయమని ఇంటి ఓనరు పెట్టే పోరు పడలేకపోతున్నది.

''చేతిల చిల్లి గవ్వ లేన్నాడు గూడ నా బిడ్డలను పోషించుకున్న. అంతేగాని ఏనాడూ 'మీ సావు మీరు సావండి' అని వాళ్లను ఇడిసిపెట్టి నా సుఖం నేను జూస్కోలేదు గదా! మల్ల నా కొడుక్కు నేనెట్ల భారమైతి. నా కిస్మతి ఇట్లెందుకున్నదో!'' అని ఒంటరి పక్షిలా రాత్రుళ్లు గోడలతో చెప్పుకొని ఏడ్చేది.

* * *

తల్లి, తండ్రి లేని పిల్ల అని.. ఆమెను చూసుకోవడం భారమని నాగమ్మ మేనత్త ఆమెకు పదమూడేళ్లకే తెలిసిన మంచి సంబంధమని చెప్పి పెళ్లి చేసేసింది. నాగమ్మకు, ఆమె భర్తకు వయసులో పదిహేనేళ్ల తేడా. పైగా అతనికి లేని అలవాటంటూ లేదు. మరీ ముఖ్యంగా మందే మంచినీళ్లతనికి. తాగొచ్చి నాగమ్మను రోజూ ఏదో ఒకదానికి కొడుతూండేవాడు. పెళ్లి తరువాత ఆమె పుట్టింటివాళ్లు ఇటువైపు కనీసం తొంగి కూడా చూడకపోడం అతనికి మరింత ధీమాగా ఉండేది.

భర్త విషయంలో కన్నీళ్లు పెట్టి పెట్టి ఆఖరికి తన ఒంట్లో ఇక కన్నీరే మిగల్లేదేమో అన్నంతలా మొద్దుబారిపోయింది. చివరికి ఆ తాగుడే అతణ్ని తీస్కెళ్లిపోయినా.. ఆమెలో ఏ చలనం లేకుండా ఉండింది.

అప్పటికే ఇద్దరు పసివాళ్లున్న నాగమ్మను కొన్నిరోజులకు అత్తింటి వాళ్లు వదిలించుకున్నా.. మౌనంగా, నిస్సహాయంగా తప్పుకొన్నదే కానీ అడ్డుపడి ఒక్కమాట కూడా అడగలేదు, అనలేదు.

ఇటు పుట్టింటి వాళ్లూ ఆమెను ఎప్పటిలాగే చూశారు. దాంతో రోడ్డున పడింది.

పొట్ట కూటి కోసం తిరిగితిరిగి వాళ్లను వీళ్లను అడిగి దొరికిన పనల్లా చేసుకునేది.

అంత కష్టంలోనూ మొండిగానే ఉన్న నాగమ్మకు.. మెదడు సరిగాలేని తన చిన్నకొడుకు ఇంట్లోంచి ఎటో వెళ్లిపోయి తప్పిపోయినప్పుడు తడైన ఆమె కళ్లు చాలా ఏళ్లవరకు తడిగానే ఉండిపోయాయి.

ఇక తనకంటూ మిగిలిన పెద్ద కొడుకే ఆమెకు వెన్ను ముక్కనుకుని బతుకుతుంటే.. ఇప్పుడతను తనను వొద్దనుకుంటున్నాడని అర్థమయ్యాక ఆమె గుండెను ఎవరో కాళ్లకిందేసి తొక్కి, రంపంతో కోస్తున్నట్లుంది.

* * *

వారమైపోయింది. ఓనర్‌తో ఇక మాటలు పడలేక.. ఆమెకొచ్చే పింఛన్లో నెలనెలా కొంత డబ్బును పక్కకు తీసి, తన ముగ్గురు మన్మరాళ్లకు పండక్కి బట్టలు కొనిద్దామని ఎప్పట్నుంచో జమ చేసుకున్న పైసలతో కిరాయి కట్టింది. ఆ తర్వాత అక్కణ్నుంచి వచ్చేసి దిక్కు తోచక బస్టాండ్‌లో కూర్చుంది.